సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం। 18। అక్టోబర్। 2024



కారు బోల్తా .. ఒకరి మృతి

ముంచంగిపట్టు: అనరాడ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. 8లో



అప్పన్నకు పౌర్ణమి తిరువీధి

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు.



మేహాద్రి గేటు ఎత్తివేత

విశాఖ: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరడంతో అధికారులు గేటును ఎత్తారు.

న్యూస్‌రీల్

వాల్మీకి మహర్షికి ఘన నివాళి

- కలెక్టరేట్, ఐటీడీఏలో జయంతి నిర్వహణ



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్, పీవో

సాక్షి, పాడేరు: ఆధ్యాత్మిక జ్ఞాని, తాత్వికుడు మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డా.అభిషేక్‌గౌడ్, పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్య మన్‌పటేల్, డీఆర్‌వో పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవో వి.అభిషేక్, సహాయ ప్రాజెక్ట్ అధికారులు వీఎస్ ప్రభాకర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, ఐటీడీఏ అకౌంటెంట్ అధికారి శ్రీనివాస్‌కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

- రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా ఎక్కడైనా వివాహం చేస్తే 2006 బాల్య వివాహాల చట్టం ద్వారా శిక్షించబడతారని తెలిపారు. ఏజెన్సీలో బాల్య వివాహాల చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సచివాలయ మహిళ పోలీసులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనపై పోలీస్‌శాఖ అప్రమత్తంగా వ్యవహరించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీలో అన్ని పాఠశాలలో బాల వివాహాల నిర్మూలనపై విద్యార్థినులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో సీడీపీవో సంధ్యారాణి, సీఐ రవికుమార్, సూపర్‌వైజర్లు కుమారి పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు చట్టం అవసరం

- కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ర్యాలీ
- రంపచోడవరం, మోతుగూడెంలో నిరసన





రంపచోడవరం, మోతుగూడెంలో వైద్యుల ర్యాలీ

రంపచోడవరం/మోతుగూడెం: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగిన సంఘటనను ఖండిస్తూ రంపచోడవరం ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది,మోతుగూడెంలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి నుంచి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం వరకు నిరసన తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు ఇబ్బంది లేకుండా చూశారు. హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్య సిబ్బందిపై దాడులను అరికట్టాలని, వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఆస్పత్రి వైద్యాధికారి ప్రవల్లిక, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరుగులో చిరుత



- రన్నింగ్‌లో సత్తా చాటుతున్న లోహిత్‌బాబు

8లో



నాటు పడవపై వెళ్తున్న కోసంపుట్టు గిరిజనులు



నాటు పడవ ఎక్కుతున్న కుమ్మరిపుట్టు గిరిజనులు

ప్రాణాలు పోతున్నా.. పడవ ఎక్కాల్సిందే!

గిరిజన ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పడినా ఇప్పటికీ చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. ముఖ్యంగా మత్స్యగెడ్డ **అవతలి గ్రామాల** గిరిజనుల పరిస్థితి మరింత **దయనీయం. నిత్యం** మత్స్యగెడ్డను దాటితేనే **వారి జీవనం సాగేది.** ఏ అవసరం వచ్చినా **నాటు పడవలపై** ప్రయాణం చేయాల్సిందే. **ఈ క్రమంలో ప్రమాదా**లకు గురై చాలామంది **ప్రాణాలు కోల్పో**యిన సంఘటనలు **ఉన్నాయి. కుమ్మరిపు**ట్టు వద్ద వంతెన నిర్మిస్తే **ఈ సమస్య తప్పుతుం**దని సుమారు 15 **గ్రామాల ప్రజలు** మొరపెట్టుకుంటున్నా పాల**కులు, ప్రభుత్వాలకు** పట్టడం లేదు.

• ప్రమాదకరంగా మత్స్యగెడ్డపై ప్రయాణం • ఇప్పటివరకు మునిగి 86 మంది మృతి

- వర్షాకాలంలో తరచూ ప్రమాదాలు
- నాటు పడవలను ఆశ్రయిస్తున్న మారుమూల గ్రామాల ప్రజలు
- కార్యరూపం దాల్చని ఫైబర్ బోట్లు ఏర్పాటు
- ప్రతిపాదనలకు పరిమితమైన కుమ్మరిపుట్టు వద్ద బ్రిడ్జి నిర్మాణం
- 8 పంచాయతీల పరిధిలో 15 గ్రామాల గిరిజనుల అవస్థలు
- నేతల హామీలు ప్రచారానికే పరిమితం
- నాటుపడవ బోల్తాపడి గిరిజనుడి గల్లంతుతో ఆందోళన

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలో పనసపుట్టు, సుజనకోట, పెదగూడ, ధారెల, వనుగుమ్మ, జోలాపుట్టు, మాకవరం, రంగబయలు పంచాయతీల పరిధిలో సుమారు 15 గ్రామాల మీదుగా మత్స్యగెడ్డ విస్తరించి ఉంది. వీరు గ్రామం దాటాలంటే మత్స్యగెడ్డపై నాటు పడవలో ప్రయాణం చేయాల్సిందే. నాటు పడవలపై ప్రయాణించి మండల, పంచాయతీ కేంద్రాలకు పనుల నిమిత్తం వస్తుంటారు. గిరిజన మత్స్యకారులు కూడా నాటు పడవలపై వెళ్లి చేపలవేట సాగిస్తుంటారు. వలలకు చిక్కిన చేపలను మండల కేంద్రం, వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో నాటు పడవలు బోల్తా కొట్టడంతో వేర్వేరు ఘటనలో ఇప్పటివరకు 86 మంది ప్రాణాలు కోల్పోయారు.

➡ ప్రమాదాలు జరిగే సమయాల్లో మాత్రమే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీలను ఆ తరువాత విస్మరిస్తున్నారు. మత్స్యగెడ్డను దాటేందుకు ఫైబర్ బోట్లు, గిరిజన మత్స్యకారులకు వలలు పంపిణీ చేస్తామన్న పాడేరు ఐటీడీఏ అధికారుల హామీలు నెరవేరడం లేదు.

తాడు పట్టు తప్పితే..

సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు వద్ద ప్రతిరోజు గిరిజనులు తాడు సాయంతో నాటు పడవపై రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా పడవలో ఉన్నవారంతా ప్రమాదానికి గురి కావాల్సిందే.ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా గిరిజనులు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించే నేతలు గెలిచిన తరువాత పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యగెడ్డపై రాకపోకలు సాగించేందుకు కనీసం రవాణా సాధనాలు కూడా ఏర్పాటుచేయలేదు. గిరిజన మత్స్యకారులు సైతం రూ.30 వేల నుంచి రూ.40 వేలు వెచ్చించి నాటు పడవలను తయారు చేయించుకోవాల్సి వస్తోంది.

బోట్లు, వలల పంపిణీకి ప్రతిపాదనలు



మత్స్యగెడ్డ ప్రాంత గిరిజనులు బోట్లు, వలలు రాయితీపై అందించాలని మా దృష్టికి తీసువచ్చారు. ప్రతిపాదనలు పంపించాం . త్వరలోనే ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల మత్స్యగెడ్డ పరివాహిక గిరిజనులకు అందిస్తాం. మత్స్యగెడ్డ అవతల గ్రామాలకు వెళ్లేందుకు అవసరమైన చోట వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించాం . మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహించడం వల్ల నాటు పడవలపై ప్రయాణం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

– వి.అభిషేక్, పీవో, పాడేరు ఐటీడీఏ



ఓటు హక్కు వినియోగించుకునేందుకు మత్స్యగెడ్డ మీదుగా నాటు పడవపై వెళ్తున్న బీట గిరిజనులు

ప్రాణాలను మింగేస్తున్న మత్స్యగెడ్డ

- ➡ **2004:** సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు వద్ద ప్రమాదవశాత్తూ మత్స్యగెడ్డలో మునిగి ఆరుగురు చిన్నారులు మృతి చెందారు.
- ➡ **2011:** పెదగూడ పంచాయతీ గలగండ గ్రామ గిరిజనులు ఒడిశా వెళ్లి వస్తుండగా నాటు పడవ మునిగిపోవడంతో ముగ్గురు గిరిజనులు చనిపోయారు.
- ➡ **2014:** రంగబయలు పంచాయతీ కోసంపుట్టు, పట్నపడాల్‌పుట్టు గ్రామాల గిరిజనులు నాటు పడవపై ఒడిశా వారపు సంతకు వెళ్తుండా బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.
- ➡ **2015:** రంగబయలు పంచాయతీ పట్నపడాల్‌పుట్టు గిరిజనులు సరుకుల కోసం మత్స్యగెడ్డ దాటుతుండగా గల్లంతై ఇద్దరు గిరిజనులు మృతి చెందారు.
- ➡ **2017:** ధారెల పంచాయితీ పెద్దపేట వద్ద మత్స్యగెడ్డలో చేపలను వేటాడుతుండగా ప్రమాదానికి గురై ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.
- ➡ **2022:** వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామం నాటు పడవ మునిగి ఇద్దరు మృతి చెందారు.

భయం భయంగా ప్రయాణం



మత్స్యగెడ్డను నిత్యం దాటుతూ భయం భయంగా ప్రయాణం చేస్తున్నాం. చాలా సందర్భాల్లో పడవలు మునిగి గిరిజనులు మృతి చెందుతున్నారు. సంఘటనలు జరిగిన సమయాల్లో అధికారులు, పాలకులు హడావుడి చేసి హామీలు ఇస్తున్నారు. ఆ తరువాత పట్టించుకోవడం లేదు.

– గౌరిశంకర్, పెద్దపేట, ధారెల పంచాయితీ,ముంచంగిపుట్టు మండలం

గెడ్డ దాటితేనే బతుకు సాగేది



మత్స్యగెడ్డను దాటితేనే మా బతుకులు ముందుకు సాగుతాయి. వారపు సంతలకు, మండల కేంద్రానికి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొని వెళ్తా ఉంటాం .ప్రస్తుతం నాటు పడవలు పాడైపోవడంతో తాడు సహాయంతో కుమ్మరిపుట్టు వద్ద గెడ్డను దాటుతున్నాం.

– లక్ష్మణ్, గొడుగులపుట్టు, సుజనకోట పంచాయతీ

నాటు పడవ బోల్తా

గిరిజనుడి గల్లంతు..
కొనసాగుతున్న గాలింపు



పెద్దపేట మత్స్యగెడ్డ వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు



వేణుగోపాల్‌స్వామి (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ పెద్దపేట సమీపంలోని మత్స్యగెడ్డలో గురువారం నాటు పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక గిరిజనుడు గల్లంతయ్యాడు. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన కొర్ర వేణుగోపాల్‌స్వామి (24) వ్యవసాయ పరికరాలకు సాన పెట్టేందుకు ముంచంగిపుట్టు మండలం ధారెల పంచాయతీ పెద్దపేట గ్రామానికి బయలుదేరాడు. నాటుపడవపై మత్స్యగెడ్డ దాటుతుండగా పడవలోకి నీరు చేరి ఒక్కసారిగా బోల్తా కొట్టింది. దీంతో వేణుగోపాల్‌స్వామి గెడ్డలో మునిగిపోయాడు. దీన్ని గమనించిన పెద్దపేట, పేటమాలిపుట్టు గ్రామాల గిరిజనులు హుటాహుటిన మత్స్యగెడ్డవైపు పరుగులు పెట్టి చూసేసరికే నాటుపడవ గెడ్డలో తేలుతూ కనిపించింది. వేణుగోపాల్ గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల తహసీల్దార్లు సర్సమ్మ, రంగారావు, ఎస్‌ఐ రవీంద్ర, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీలు మల్లికార్జున్, బోంజుబాబు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి, వివరాలు తెలుసుకున్నారు. స్థానికులతో నాటు పడవలపై మత్స్యగెడ్డలో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు చేశారు. గల్లంతైన వేణుగోపాల్‌స్వామికి రెండేళ్ల క్రితమే పెళ్లి అయింది.

గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024–25కు సంబంధించి సీబీఎస్ బోధించే గెస్ట్ టీచర్ల నియామకానికి దర ఖాస్తులు స్వీకరిస్తున్నామని పీవో అభిషేక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టీజీటీ–10, టీజీటీ హింది–02, పీజీటీ తెలుగు–01, పీజీటీ ఇంగ్లీషు–01, పీజీటి కెమిస్ట్రీ–01, పీజీటీ బయాలజీ–06 పోస్టుల భర్తీకి అర్హత గల దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులతో పాటు కేంద్రీయ విద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంబంధిత అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 18నుంచి ఈనెల 26 సాయంత్రం ఐదుగంటల లోపు పాడేరు ఐటీడీఏలోని గురుకులం సెల్‌కు అందజేయాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు ఐటీడీఏ పాడేరు వెబ్‌సైట్‌తోపాటు 9493758072,9493845498 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏటా పర్యాటక వారోత్సవాలు

- డిసెంబర్‌లో అరకు ఉత్సవం
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: ఏటా పర్యాటక వారోత్సవాలు నిర్వహించడమే కాకుండా ప్రతీ డిసెంబర్‌లో అరకు ఉత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పర్యాటకశాఖ చైర్మన్, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన పర్యాటక శాఖ అధికారులతో టూరిజం కౌన్సిల్ జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ఇతర రాష్ట్రాల గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, వివిధ వస్తువుల అమ్మకాల స్టాళ్లు, వినోద కార్యక్రమాలు, అడ్వంచర్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. డిసెంబర్ మొదటి వారంలో ముందుగా అరకు ఉత్సవం నిర్వహణకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ ఉత్సవాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా నిర్వహించాలని, రానున్న పదేళ్లలో ఉత్సవాలు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఐదు ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటకుల వాహనాల పార్కింగ్, వసతి, రవాణా సౌకర్యం, ఆహార పదార్థాల స్టాళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్‌లో గుడిసె పర్యాటక కేంద్రం పారిశుధ్యం మెరుగుకు సంబంధించి నివేదిక అందజేయాలని కోరారు. వంజంగి ప్రాంతాన్ని పాడేరు ఐటీడీఏ పీవో పరిశీలించాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడి, తద్వారా వచ్చే ఆదాయం, ఖర్చు తదితర అంశాలు పొందు పరచాలన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, లీగల్ కమిటీ చైర్మన్‌గా పాడేరు సబ్ కలెక్టర్ వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక కేంద్రాలు సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

ప్రైవేట్ వాహనాల దందాకు చెక్

గుడిసె, కటిక జలపాతం తదితర పర్యాటక ప్రాంతాలకు సొంత వాహనాలను అనుమతించకుండా సమస్యలు సృష్టిస్తూ అధిక వసూళ్లకు పాల్పడుతున్న దందాను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. అటువంటి ప్రైవేట్ వాహనాలకు చెక్ పెట్టేలా కమిటీ నిర్ణీత రుసుం స్థిరీకరించి ఆ రుసుమకే పర్యాటకులను తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం డీఎఫ్‌వో రవీంద్ర దామ, జిల్లా పర్యాటక అధికారి జి.దాసు, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళీకృష్ణ, వర్చువల్ విధానంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, రీజనల్ డైరెక్టర్ (విశాఖ) శ్రీనివాస్ పాణి పాల్గొన్నారు.

మన్యం కాఫీ రుచి అద్భుతం

కలెక్టర్ దినేష్‌కుమార్



కాఫీ పొడి యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: గిరిజన కాఫీ ఘుమఘుమలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని గెడ్డంపుట్టులోని మన్యతోరణం రైతు ఉత్పత్తి దారుల కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం ఆయన సందర్శించారు. కాఫీ పండ్ల సేకరణ, పల్పింగ్, క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, కాఫీ పౌడర్ తయారీ, కాఫీ డికాక్షన్ తయారీ, కాఫీ కలిపే విధానాన్ని పరిశీలించారు. అనంతరం కాఫీ రుచి చూసి తయారీ దారులను అభినందించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘ కార్యక్రమాలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాఫీ మార్కెటింగ్ విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన కాఫీ విస్తరణ, ప్రచారానికి 50 మంది గిరిజన యువకులకు శిక్షణ అందించాలని ఆయన సూచించారు. కాఫీ ఉత్పత్తిదారులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తామని అన్నారు. కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన రైతులు పూర్తిగా పక్వానికి వచ్చిన కాఫీపండ్లను మాత్రమే సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు ఉప సంచాలకులు సమాల రమేష్, సంఘం ప్రతినిధి దూరు వెంకటరమణ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి



వాటర్‌షెడ్ పనుల వివరాలను తెలుసుకుంటున్న బృందం సభ్యులు



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఎన్‌ఎల్‌ఎం టీం లీడర్ సుధాకర్‌రెడ్డి

కొయ్యూరు: గిరిజనుల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని జాతీయ స్థాయి పర్యవేక్షణ (ఎన్‌ఎల్‌ఎం) టీం లీడర్ సుధాకర్‌రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలను ఆయన ఆధ్వర్యంలో బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. దీనిలో భాగంగా కొయ్యూరు, మర్రివాడ, బూదరాళ్లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాల పెంపునకు వాటర్ షెడ్ పథకం దోహదపడుతున్నారు. రైతులు, డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి సంబంధించి సూచనలు చేశారు. ఉపాధి నిధులతో కొయ్యూరు గురుకుల పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ చెరువుతో పాటు కందకాలు, ఆయిల్‌పామ్ తోటలను బృందం సభ్యులు పరిశీలించారు. వాటర్ షెడ్ ఏపీడీ శ్రీనివాస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ లోకేష్, కొయ్యూరు ఏపీవోలు శ్రీనివాస్, రాజు జేఈ వీర్రాజు, వీఆర్పీ కృష్ణ, సర్పంచ్ బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఆశ్రమ విద్యార్థి ఎంపిక



విద్యార్థి చిరుతను అభినందిస్తున్న హెచ్‌ఎం,ఉపాధ్యాయులు



కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికైన చిరుత

పెదబయలు: రాష్ట్ర స్థాయి అండర్–14 విభాగం కబడ్డీ జట్టుకు స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి కిల్లో చిరుత ఎంపికయ్యాడు. ఈ నెల 16 తేదీన అనకాపల్లి జిల్లా వేములపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు హెచ్‌ఎం చెట్టి మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి చిరుతను గురువారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌డబ్ల్యూవో జగత్‌రాయ్, పీడీ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అనంతరావు, దీక్షపతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పరుగులో చిరుత



ఒకప్పుడు పరుగెత్తడానికి బిడియం పడిన గిరిజన బిడ్డ.. ఇప్పుడు చిరుతలా దూసుకుపోతున్నాడు. మైదానంలో దిగితే పతకం ఖాయమనే రీతిలో సత్తా చాటుతున్నాడు. గిరిజన రైతు కుటుంబంలో పుట్టి.. రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తూ పతకాల పంట పండిస్తున్నాడు. మన్యానికే పేరు ప్రఖ్యాతులు తెస్తున్నాడు. అతడే శెట్టి లోహిత్‌బాబు.. పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు.

- అథ్లెటిక్‌లో దూసుకుపోతున్న గిరి యువకుడు
- రన్నింగ్‌లో సత్తా చాటుతున్న లోహిత్‌బాబు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో 39 బంగారు, వెండి పతకాలు సొంతం


సాధించిన పతకాలు


లోహిత్‌బాబును అభినందిస్తున్న ఐటీడీఏ పూర్వ పీవో వెంకటేష్


కోచ్‌లతో లోహిత్‌బాబు


క్రీడాకారులను అభినందిస్తున్న పూర్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ రంజిత్‌బాషా

అరకులోయ రూరల్: అథ్లెటిక్ క్రీడా పోటీల్లో శెట్టి లోహిత్‌బాబుకు సత్తా చాటుతున్నాడు. అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగుడ గ్రామానికి చెందిన గిరిజన వ్యవసాయ కుటుంబానికి చెందిన సంజీవరావు, ప్రేమమల్లి దంపతుల తనయుడు లోహిత్‌బాబు ఐదో తరగతి విశాఖపట్నం మారికవలస గురుకులం పాఠశాలలో చదువుతూ క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. అక్కడ చదువుతుండగానే 2017లో అరకువేలి క్రీడా పాఠశాలకు ఎంపికయ్యాడు. అప్పటి నుంచి క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి ప్రత్యేక చొరవతో కోచ్‌లు గణపతి, కొండల్‌స్వామిల పర్యవేక్షణలో క్రీడా రంగంలో రాణిస్తున్నాడు. ప్రస్తుతం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

సాధించిన పతకాలు ఇవే...

2018 నుంచి 2024 వరకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీలో పాల్గొని 22 బంగారు పతకాలు సాధించాడు. ఇవే కాకుండా 2018–21 వరకు జాతీయ స్థాయిలో –6 వెండి, 2021లో కాంస్యం , 2022లో జాతీయ స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించాడు.

2024లో జాతీయ స్థాయిలో నిర్వహించిన అండర్ –20 అథ్లెటిక్ జూనియర్ విభాగంలో పాల్గొని 8 బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొన్నాడు. అండర్ –20లో 200, 400 మీటర్ల రన్నింగ్‌లో మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు.

ప్రోత్సాహమందిస్తే ఉన్నత స్థాయికి..

వ్యవసాయ కుటుంబానికి చెందిన నా తల్లిదండ్రులు క్రీడల్లో నాకు ఎంతగానో ప్రోత్సాహం అందిస్తున్నారు. గతంలో పాడేరు ఐటీడీఏ పీవో వెంకటేష్ ప్రోత్సాహం అందించడం వల్ల ఈ స్థాయికి చేరుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే క్రీడా రంగంలో మరింత రాణించి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి ఈ ప్రాంతానికే పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తాను.
– శెట్టి లోహిత్‌బాబు, డుంబ్రిగుడ

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి


హోమం చేస్తున్న మత్స్యరాజు, గాయత్రి దంపతులు

జి.మాడుగుల: స్థానిక పాకలపాటి గురుదేవుల ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు, పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎం గాయత్రి, భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో వేద మంత్రోచ్ఛరణలతో శాంతి హోమం నిర్వహించారు.

అరకు వ్యాలీకి హెలిప్యాడ్ సేవలు ప్రారంభించండి

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి ఎంపీ కలిశెట్టి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో 'అరకు వ్యాలీ'కి ఎంతో గుర్తింపు ఉందని, ఇక్కడకు స్వదేశీయులే కాకుండా ప్రపంచం నలుమూలల నుంచి విదేశీయులు వస్తున్నట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. అరకు వ్యాలీకి సందర్శకులు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన అప్పలనాయుడు అరకు వ్యాలీకి హెలిప్యాడ్ సేవలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అక్కడున్న ప్రకృతి సౌందర్యం స్థానిక తెగల సంస్కృతిని ప్రతిబింబిస్తుందని తెలిపారు. అరకు వ్యాలీకి చేరుకోవడానికి పర్యాటకులు ఎంతో ఇబ్బందులకు గురి అవుతున్న నేపథ్యంలో హెలిప్యాడ్ సేవలు అవసరమన్నారు. ఎంపీ వినతిపై ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో దీనిపై ఓ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఎంపీకి హామీ ఇచ్చారు.

ప్రమాదస్థాయికి చేరువలో 'తాండవ'

నాతవరం: ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయర్ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరువలో ఉంది. గురువారం సాయంత్రానికి 377.3 అడుగుల నీరు ఉంది. తాండవ ఆయకట్టు భూములకు ప్రధాన గేట్ల నుంచి పంట కాలువల ద్వారా రోజుకు 555 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరిందని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు అధికంగా ఉండి 378 అడుగులు చేరే సరికి ప్రమాద హెచ్చరికలు జారీ చేసి స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తామన్నారు.

కారు బోల్తా .. ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అసరాడ గ్రామ సమీపంలో గురువారం కారు అదుపు తప్పి బోల్తా పడింది.ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా బోయిపరిగూడ గ్రామానికి చెందిన నలుగురు మండలంలోని జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు గ్రామానికి వచ్చారు. ఇక్కడి నుంచి తిరిగి ఒడిశా వెళ్తుండగా వనుగుమ్మ పంచాయతీ అసరాడ గ్రామ మలుపు వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ ఉమాశంకర్ బుయా, సిద్ధాంతి మహంతి తీవ్రంగా, వెనుక కూర్చున్న ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే వీరిని అసరాడ, తర్లాగూడ గ్రామ గిరిజనులు కారులోంచి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ప్రైవేట్ వాహనంలో ఒడిశాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ ఉమాశంకర్ బుయా మృతి చెందాడు. మహంతి కోలుకుంటున్నాడు. బ్రేక్ ఫెయిల్ కారణంగా ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ఇలావుండగా మృతుడు ఉమాశంకర్ బుయా బోయిపరిగూడ గ్రామానికి చెందినవాడుగా వారు పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ స్టేట్ మీట్‌కి నలుగురు విద్యార్థులు


ఎంపికైన హోసన్నా హైస్కూల్ విద్యార్థులు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి హోసన్నా హైస్కూల్‌కి చెందిన నలుగురు విద్యార్థులు ఫుట్‌బాల్ స్టేట్ మీట్‌కి ఎంపికయ్యారు. గురువారం రాజమహేంద్రవరంలో జరిగిన అండర్–14 ఎంపిక పోటీల్లో బి.అంజలి, జి.శామ్యూల్ సమురి, వి.ప్రవీణ్, పనర్సయ్య ప్రతిభ కనబరిచారు. వీరిని హైస్కూల్ ప్రిన్సిపాల్ సందీప్, సిబ్బంది అభినందించారు.

రసం పీల్చే పురుగుల నివారణకు జిగురు అట్టలు

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్


జి.మాడుగులలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్

జి.మాడుగుల: రాజ్‌మాలో రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టల వంటి పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఏవో లకే పాత్రు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రాజ్‌మా పంటలను గురువారం వీఏఏ, వీహెచ్‌ఏలు, ఎంపీఈవోలతోపాటు వారు సందర్శించారు. రాజ్‌మాలో రసం పీల్చు పురుగుల ఉధృతిని పరిశీలించారు. నివారణ చర్యలు నిమిత్తం వేపనూనె పిచికారీ చేసుకోవాలని సూచించారు. పసుపు రంగు జిగురు అట్టలతో తెగుళ్ల అరికట్టవచ్చాన్నారు. అట్టలు అమెజాన్‌లో లభిస్తాయన్నారు. రాజ్‌మా పంట పూత దశ ప్రారంభమైందని, సకాలంలో వర్షాలు పడటం వల్ల రైతులు ఆనందంతో ఉన్నారన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ : జాతీయ యువజన ఉత్సవాలు 'ప్రజాతంత్ర 2024'కు రాష్ట్రం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వీసీ ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన కార్యాలయంలో వీరిని అభినందించారు. నవంబర్ 16 నుంచి 18 వరకు లక్నోలో జరిగే ఈ యువజన ఉత్సవాలలో రాష్ట్రం తరపున ఏయూ నుంచి ఎం.శివాని లహరి, డి.హర్షిత ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి


అవగాహన కల్పిస్తున్న సీఐ సన్యాసినాయుడు

అడ్డతీగల: యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని సీఐ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక ఇంటర్మీడియట్ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. గంజాయి ఏ ఒక్కరూ వినియోగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎస్ఐ వినోద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి చదువులు చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని సీఐ సన్యాసినాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని గూడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. గిరిజన యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. చిన్నతనంలోనే వివాహాలు చేయడం వల్ల భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో గంజాయి, మద్యపానం అనర్థాలపై వ్యసనపరులకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా


చెక్కు అందిస్తున్న మేనేజర్ సురేష్‌కుమార్, సర్పంచ్ భాగ్యవతి

ముంచంగిపుట్టు: బీమా చేయడం వల్ల కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని ఏపీజీవీబీ మేనేజర్ పి.సురేష్ కుమార్ తెలిపారు. మండలంలో జర్రెల పంచాయతీ డేగల పుట్టు గ్రామంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన లబ్ధిదారు సీసా మొనిమ్మ మృతి చెందింది. ఆమె కుమారులు గోపాల్, త్రినాథ్‌లకు రూ.2 లక్షల చెక్కును మేనేజర్ సురేష్‌కుమార్, సర్పంచ్ భాగ్యవతి, బీఎస్పీ మండల నేత మాధవరావు గురువారం అందజేశారు. మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ రూ.436తో బీమా పథకంలో చేరడం వల్ల కుటుంబాలకు కష్టకాలంలో ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎస్పీ భాగత్‌రామ్ పాల్గొన్నారు.

దేశ రక్షణలో రాజీ ప్రసక్తే లేదు

- నేవీ జెట్టీ ప్రారంభించిన నౌకాదళాధిపతి


నేవీ జెట్టీని ప్రారంభిస్తున్న భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠీ పునరుద్ఘాటించారు. విశాఖలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన సతీమణి, నేవీ వెల్ఫేర్ వెల్‌నెస్ అసోసియేషన్(ఎన్‌డబ్ల్యూడబ్ల్యూఏ) ప్రెసిడెంట్ శశి త్రిపాఠీతో కలిసి తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా నావికాదళానికి సంబంధించి అత్యాధునిక ఎన్1–ఎన్3 జెట్టీని అడ్మిరల్ త్రిపాఠీ ప్రారంభించారు. పూర్తిస్థాయి మోడ్రన్ సపోర్ట్ ఫీచర్స్‌తో యుద్ధ నౌకల బెర్తింగ్‌కు అనుగుణంగా ఈ జెట్టీని నిర్మించారు. తూర్పు నౌకాదళ అమ్ములపొదిలోకి అదనపు యుద్ధ నౌకలు చేరుతున్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో అదనపు బెర్తింగ్‌కు ఈ జెట్టీ కీలకంగా మారుతుందని నేవీ చీఫ్ అన్నారు. ఈ సందర్భంగా ఈస్టర్న్ ఫ్లీట్‌లో ఉన్న యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో నేవీ చీఫ్ సంభాషించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పాల్గొన్నారు.

అభిజిత్ కంపెనీ లే–ఆఫ్ దారుణం

- తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన
- న్యాయం చేయాలని వినతి


అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కంపెనీ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తమకు న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ సోమునాయుడు మాట్లాడుతూ అభిజిత్ కంపెనీ అక్రమ లే–ఆఫ్ ప్రకటించడం అన్యాయమన్నారు. ఎటువంటి సంప్రదింపులు జరపకుండా విధులకు హాజరైన కార్మికులను పరిశ్రమలోకి రాకుండా నోటీసు అంటించి గేటు బయట నిలుపుదల చేయడం దారుణమన్నారు. కార్మికులు నాలుగు రోజులుగా తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్నా అధికారులు కూడా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీస్ ప్రారంభం


ప్రీపెయిడ్ ట్యాక్సీ తొలి వినియోగదారునికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ బాగ్చీ

సాక్షి, విశాఖపట్నం : ప్రయాణికులు సురక్షితంగా ఎయిర్‌పోర్టు నుంచి తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. గురువారం ఎయిర్‌పోర్టు ఆవరణలో ఈ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ప్రీపెయిడ్ ట్యాక్సీకీ జీపీఎస్‌ని అనుసంధానం చేశామని.. ఏ కారణం చేతనైనా అనుకున్న సమయానికి ట్యాక్సీ గమ్యస్థానానికి చేరకపోతే తక్షణమే దాన్ని ట్రాక్ చేసే వీలుంటుందన్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ నడిపే డ్రైవర్లందరూ పూర్తి శిక్షణ కలిగి ఉండడంతో పాటు వారి పర్సనల్ డేటా కూడా తమ వద్ద ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో వయోజన విద్యకు ఊతం

- అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని, జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని తెలిపారు. 2024–25 సంవత్సరానికి 11,900 మందికి వయోజన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అక్షరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పంచాయతీరాజ్, గ్రామ సచివాలయం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, ఉపాధి హామీ కూలీల్లో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఆ సమాచారాన్ని వయోజన విద్య అధికారులకు అందించాలని, వారిని ఈ పథకం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను అక్షరాస్యతా కేంద్రాలుగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి వాలంటరీ టీచరు కనీసం పది మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చూడాలన్నారు. సచివాలయ స్థాయిలో సంక్షేమ సహాయకులు, విద్యా సహాయకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, నిరక్షరాస్యులను గుర్తించి సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా సేవలందించే టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ పథకానికి సంబంధించి సరఫరా చేసిన పుస్తకాలలోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.